సాక్షి
ఆదిలాబాద్
బుధవారం, 18, అక్టోబర్, 2023



**పత్రం చూపకుంటే చిక్కులే..**



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల అమలుపై యంత్రాంగం దృష్టి సారించింది. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుంది.

10లో▸



**ఘనంగా బతుకమ్మ సంబురాలు**

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.

11లో▸

గరిష్టం/కనిష్టం
34.0/23.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అప్రమత్తంగా ఉండాలి



శిక్షణ ఇస్తున్న ఆర్వో చాహత్‌బాజ్‌పాయ్

బోథ్: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో, రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఈమేరకు ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ అధికారులకు స్థానిక తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఫలితాలు వచ్చే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.అభ్యర్థులు వినియోగించే వాహనాల నంబర్లు, ఎన్నికల ఖర్చు వంటివి ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వారి ప్రచార శైలిని గమనించాలన్నారు. ఇందులో అధికారులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ప్రయాణికులకు నగదు బహుమతులు



డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు ప్రత్యేక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం నగదు బహుమతులకు సంబంధించి టికెట్ వేసే డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బుధవారం నుంచి ఈ నెల 30వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేవారు తమ టికెట్ వెనకాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లను రాయాలని తెలిపారు. వాటిని డ్రాప్‌బాక్స్‌లో వేయాలని సూచించారు. అనంతరం నిర్వహించే లక్కీ డ్రాలో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను డ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### హన్మకొండకు ఆర్టీసీ స్పెషల్ సర్వీస్

ఆదిలాబాద్: దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆదిలాబాద్ నుంచి హన్మకొండకు ప్రత్యేక బస్సు సర్వీస్ నడపనున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు రాత్రి 9 గంటలకు ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నడుపుతున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 4 గంటలకు హన్మకొండకు చేరుకుంటుందని, తిరిగి ఉదయం 10:30 గంటలకు అక్కడి నుంచి ప్రారంభమై సాయంత్రం 5:45 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేత్రపర్వంగా కుంకుమార్చన



కుంకుమార్చనకు హాజరైన మహిళలు

ఆదిలాబాద్: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో మంగళవారం కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అమ్మవారికి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని శాంతినగర్‌ని రామాలయంలో కుంకుమార్చన చేపట్టారు.



రిమ్స్ చిల్డ్రన్‌వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

# దగ్గు.. జ్వరం

- దడ పుట్టిస్తున్న ఇన్‌ఫ్లూయెంజా
- వైరల్ ఫీవర్‌తో జనం అతలాకుతలం
- ఏ ఇంట్లో చూసినా జ్వరపీడితులే
- తగ్గుముఖం పట్టని డెంగీ కేసులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇన్‌ఫ్లూయెంజా (శ్వాసకోశ సంబంధిత వ్యాధి) దడ పుట్టిస్తోంది. ఏ ఇంటికెళ్లినా ఎవరో ఒకరు దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూనే ఉన్నారు. ఈ వైరస్ కోవిడ్ మాదిరిగానే ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. బాధితులు దాదాపు పది నుంచి పక్షం రోజుల వరకు జ్వరం బారిన పడతారు. జ్వరం తగ్గిన కూడా ఒళ్లు నొప్పులు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, గర్భిణులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా సోకుతోంది. దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి తీవ్ర ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఎక్కువ మందికి ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలే కనిపిస్తున్నాయి. చిల్డ్రన్ వార్డులో ఎక్కువ మంది చిన్నారులు శ్వాస సంబంధిత ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు.కొంత మంది మృత్యువాత పడిన ఘటనలు సైతం ఉన్నాయి.

**అతలాకుతలం..**

ప్రస్తుతం జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లో వీటి బారిన పడి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం 104 కేసులు నమోదయ్యాయని పేర్కొంటుండగా, అనధికారికంగా 200కు పైగానే బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్‌తో పాటు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి, ఉట్నూర్, బోథ్ ఏరియా ఆస్పత్రులు జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈనెలలోనే 32 మంది డెంగీ బారిన పడినట్లు వైద్యారోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. కాగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి లెక్క తేలడం లేదు. మరికొంత మంది బాధితులను హైదరాబాద్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని యవత్మాల్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**కిక్కిరిసిన చిల్డ్రన్ వార్డు..**

రిమ్స్ ఆస్పత్రి చిల్డ్రన్ వార్డు చిన్నారులతో కిక్కిరిసి కనిపిస్తోంది. నెలరోజులకు పైగా ఇదే పరిస్థితి. వార్డులో 70 బెడ్లు ఉంటే.. వందకు పైగా చిన్నారులు జ్వరాలతో చికిత్స పొందుతుండడం గమనార్హం. వీరిలో ఎక్కువగా ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. చాలా మంది శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పక్షం దాటిన జ్వరం వీడటం లేదు. అలాగే మహిళా వార్డు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. జ్వరాలకు సంబంధించి అన్ని వార్డులకు కలిపి దాదాపు 400 మంది వరకు చికిత్స పొందుతున్నారు. కొద్ది రోజులుగా రిమ్స్‌లో ఓపీ 1600 వరకు నమోదవుతుంది. ఆయా పీహెచ్‌సీల్లో జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 వరకు ఓపీ ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

**దోచుకుంటున్న ల్యాబ్‌లు..**

సీజనల్ వ్యాధులను అదునుగా చేసుకొని కొంత మంది ల్యాబ్‌ల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సంబంధిత ల్యాబ్‌లకు పంపి బాధితుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. నిర్వాహకులకు 40 శాతం అందజేసి 60 శాతం వైద్యులు తీసుకుంటుండడంతో వీరి బిజినెస్ జోరుగా సాగుతోంది. అర్హతలు లేకున్నప్పటికీ చాలా మంది ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీంతో వారు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు సమాచారం. ఇంకొంత మంది శిక్షణ పూర్తి కాకుండానే ప్రైవేట్ ల్యాబ్‌లలో పనిచేస్తూ సొంతంగా పరీక్షలు జరుపుతున్నారనే ప్రచారం ఉంది. ఈ తతంగమంతా వైద్యారోగ్య శాఖ అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. నిబంధనల ప్రకారం ప్యాథలాజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, మైక్రోబయాలజిస్ట్ కోర్సు పూర్తి చేసిన వారు మాత్రమే ల్యాబ్ నిర్వహణ చేపట్టవచ్చు. అయితే దీనికి విరుద్ధంగా అనర్హులు ల్యాబ్‌లను ఏర్పాటు చేసి వైద్యులతో కలిసి అక్రమ దందా సాగిస్తున్నారు.

**వ్యాధుల కట్టడికి చర్యలు..**



జిల్లాలో వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నాం. వాతావరణ మార్పుల కారణంగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కువ మంది శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నారు. ఈ ఏడాది 104 డెంగీ కేసులు నమోదయ్యాయి. వారానికి రెండుసార్లు డ్రైడే పాటించాలని అవగాహన కల్పిస్తున్నాం. – మెట్‌పెల్లివార్ శ్రీధర్, జిల్లా మలేరియా నివారణ అధికారి

# బోథ్ రాజకీయం రసవత్తరం

- కాంగ్రెస్ టికెట్ కోసం ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు దరఖాస్తు
- బీజేపీలోనే కొనసాగుతానంటున్న 'సోయం'
- ఈ రెండు పార్టీల అభ్యర్థులు ఖరారయ్యే వరకు ఉత్కంఠే
- బీఆర్ఎస్ డైరెక్ట్ అటాక్ షురూ..

జంగ్ తెలంగాణ



బోథ్ టికెట్ కోసం రేవంత్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

సాక్షి,ఆదిలాబాద్: ఈ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి రసవత్తర రాజకీయం సాగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసి బోథ్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో హస్తం పార్టీలో చేరుతానని ఆయన చెబుతున్నారు. టికెట్ వచ్చినా.. రాకున్నా అదే పార్టీలో ఉంటానని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి హస్తం పార్టీ నుంచి ఆయనకు పూర్తి స్థాయిలో హామీ లభించిందా.. లేదా అనేది సందేహంగా ఉంది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుపై డైరెక్ట్ అటాక్ షురూ చేశారు. ఇన్నిరోజుల పాటు ఇవన్నీ అంతర్గతంగా సాగాయి. మంగళవారం బోథ్‌లో బీఆర్ఎస్ సమావేశం జరగగా, అందులో ఎంపీపీ శ్రీనివాస్ దళితబంధు దొంగ కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్ వెళ్లాడని ఆరోపించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**బీ–ఫామ్ ఇచ్చేవరకు ఆగారు..**

నెలన్నర రోజుల క్రితం బీఆర్ఎస్ జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో బోథ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకు టికెట్ దక్కలేదు. ఈ పరిణామంతో ఖంగుతిన్న బాపూరావు అప్పట్లో సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే ఆయన అపాయింట్‌మెంట్ దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు. దీంతో త్వరలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ మార్పు విషయంలో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. ఆ తర్వాత పరిణామ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వచ్చారు. దీంతో రాథోడ్ బాపూరావు పార్టీ మార్పు నిర్ణయాన్ని విరమించుకున్నారా అనే సందేహం వ్యక్తమైంది. అయితే అనిల్ జాదవ్‌కు ఈనెల 15న సీఎం కేసీఆర్ బీ–ఫామ్ అందజేశారు. అది జరిగిన రెండో రోజే బాపూరావు రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. చివరి క్షణంలోనైనా తనకు ఏదైన పిలుపు వస్తుందా అని వేచి చూశారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**సమీకరణాలపై దృష్టి పెట్టారా..**

బీజేపీ ఎంపీ సోయం బాపురావు కాంగ్రెస్‌లో చేరి బోథ్ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఇటీవల ఆయన తాను పార్టీ మారేది లేదని పలు వేదికల మీదుగా స్పష్టం చేస్తూ వస్తున్నారు. ఈ సమీకరణాల నేపథ్యంలో రాథోడ్ బాపూరావు కాంగ్రెస్ నుంచి బోథ్ టికెట్ ఆశిస్తూ రేవంత్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారని చెప్పుకుంటున్నారు. దీంట్లో ఆయన రాజకీయ సమీకరణాలతోనే ఇలా ముందుకు సాగారని కొంత మంది కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ కాంగ్రెస్‌లో చేరనుండడంతో కాంగ్రెస్ పార్టీ అనుభవజ్ఞులైన నాయకులపై దృష్టి సారించిందన్న అభిప్రాయంతో రాథోడ్ బాపూరావు టికెట్ విషయంలో ముందుకొచ్చారని చెప్పుకుంటున్నారు. తనకు ప్రత్యక్ష రాజకీయాల అనుభవం ఉండటం, బోథ్ నుంచి దరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ ఆశావహుల్లో ఈ అనుభవం లేకపోవడంతో రాథోడ్ బాపూరావు తనకేదన్న అవకాశం దక్కుతుందనే యోచనతోనే ముందుకు కదిలారని చెప్పుకుంటున్నారు. ఈపరిణామాలన్నీ బోథ్ రాజకీయంలో ఆసక్తి కలిగిస్తున్నాయి.

# బీఆర్ఎస్ వైపే ప్రజల మొగ్గు

- మాజీ ఎంపీ నగేశ్



బైక్ ర్యాలీలో పాల్గొన్న అనిల్‌జాదవ్ తదితరులు

బోథ్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని, పార్టీ బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు ఖాయమైపోయిందని మాజీ ఎంపీ గొడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొచ్చెర క్రాస్ నుంచి మండల కేంద్రం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానన్నారు. బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ దగ్గరికి బోథ్ దళితబంధు దొంగ వెళ్లి కలిశాడని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావును ఉద్దేశించి విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు సంధ్యారాణి, రాజు, కుమ్ర సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్, ఎంపీటీసీ రజిని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టికెట్ ఎవరికిచ్చినా గెలిపించుకుంటాం

- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అధిష్టానం టికెట్ ఎవరికిచ్చినా వారి గెలుపు కోసం సమష్టిగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన బోథ్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జిల్లా ఇన్‌చార్జి బద్దం లింగారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తె, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్‌తో పాటు తొమ్మిది మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్, శక్తి కేంద్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**సమావేశానికి ఆశావహుల డుమ్మా..**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నిర్వహించిన తొలి సమావేశానికి బోథ్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న పలువురు ఆశావహులు గైర్హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మానాజీ, గిరిజన మోర్చారాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, రిటైర్డ్ ఏఎస్పీ గోద్రు, బలరాంజాదవ్, జాదవ్ విజయ్ గైర్హాజరయ్యారు. మరోవైపు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సోయం తనయుడు వెంకటేశ్, అనుచరుడు జాదవ్ గోపాల్ ఇద్దరు మాత్రమే హాజరవడం విశేషం.

# రూ.50వేలు దాటితే పత్రాలుండాల్సిందే..

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో బ్యాంకర్లతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు మించి డబ్బు వెంట తీసుకెళ్లేటప్పుడు సంబంధిత పత్రాలను చూపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వివిధ శాఖల బ్యాంకు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు, పోటీచేసే అభ్యర్థుల ప్రచార ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలయ్యేలా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు ఉంటే డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని, సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ బ్యాంకులో ఎన్నికల నిబంధనలకు సంబంధించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోటీచేసే అభ్యర్థి రూ.40లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంటుందని, వారి నూతన అకౌంట్ వెంటనే యాక్టివ్ అయ్యేలా బ్యాంకర్లు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు రూ.లక్ష కన్నా ఎక్కువ విత్ డ్రా చేసినా, ఇతరులు రూ.10 లక్షల కంటే ఎక్కువ డిపాజిట్, విత్‌డ్రా చేసిన రిటర్నింగ్ అధికారికి వెంటనే సమాచారం అందించాలన్నారు. ఖాతాలవారీగా లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఏవో అరవింద్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీలు ముమ్మరం చేయాలి

- ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి



డీఎస్పీకి ప్రశంసపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం, ఇతర సామగ్రి జిల్లాలో ప్రవేశించకుండా పది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా అంతటా బెల్టు షాపులు నిర్వహించకుండా పూర్తి అడ్డుకట్ట వేయాన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వర్టికల్స్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉత్తమ ప్రతిభ కనబర్చిందని తెలిపారు. వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్‌కు డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రశంసపత్రాన్ని అందజేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసినందుకు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌కు డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన పత్రాన్ని అందజేశారు. జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. మట్కా, గంజాయి, పేకాట వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల సమయంలో మట్కా, బెల్ట్‌షాప్ నిర్వహించే వారిని, రౌడీషీటర్లను బైండోవర్ చేసి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టడి చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించాలన్నారు. ఆగస్టులో ప్రతిభ కనబర్చిన 16 మంది పోలీసు అధికారులకు నగదు రివార్డులు అందజేశారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, పోలీసు అధికారులు, రిజర్వ్ సిబ్బంది, ఐటీ కోర్, ఎస్బీ, డీసీఆర్బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ రాథోడ్ ప్రకాశ్



మాట్లాడుతున్న రాథోడ్ ప్రకాశ్

నేరడిగొండ: రాష్ట్రంలో కొనసాగుతున్న కేసీఆర్ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని కర్ణాటక ఎమ్మెల్సీ, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ రాథోడ్ ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ 65 ఏళ్ల పాలనలో రూ.75వేల కోట్ల అప్పు చేస్తే, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేళ్లలో రూ.5.60 లక్షల కోట్లు అప్పు చేసిందని విమర్శించారు. మద్యం అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చేలా చూడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు జాదవ్ నరేశ్, నాయకులు ఆడే గజేందర్, కొమురం కోటేశ్వర్, అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఆడె వసంత్‌రావు, భూపెల్లి శ్రీధర్, చంటి, మహమూద్ ఖాన్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

**గడపగడపకూ గ్యారెంటీ పథకాలు తీసుకెళ్లాలి**

బోథ్: కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని రాథోడ్ ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు సొనాలలో కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ బూత్ పరిధిలో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఇందులో నాయకులు ఆడె గజేందర్, నరేశ్ జాదవ్, శ్రీధర్, కుమ్రం కోటేష్, మహేందర్, శేఖర్ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌కాలనీలో తనిఖీలు

**నిర్మల్‌రూరల్:** జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో రూరల్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పలు దుకాణాలు, అనుమానిత ఇళ్లను తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన రూ.15 వేల విలువ గల టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

**తానూరు:** సరిహద్దులో ప్రాంతంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ముథోల్ సీఐ వినోద్ అన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని జౌలా(బి) సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

**తలమడుగు:** పెళ్లి కావడం లేదని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం..మండలంలోని పల్లి (కె) గ్రామానికి చెందిన చింతల పెల్లి ఉపేందర్‌రెడ్డి (30) గతేడాది గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్నాడు. దీంతో పెళ్లి సంబంధాలు వచ్చి వెళ్లిపోతున్నాయి. నాకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి లింగారెడ్డి ఫిర్యాదుతో ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గంజాయి మొక్కలు ధ్వంసం



ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

**నార్నూర్:** మండలంలోని చోర్‌గావ్ శివారులోని పంట పొలాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై టి.మహేందర్ తెలిపారు. కసావత్ సోనుసింగ్ తన పొలంలో పత్తి, కంది పంటతోపాటు గంజాయి సాగు చేస్తున్నారని ఎక్సైజ్ అధికారి హిమశ్రీకి అందిన సమాచారంతోనే దాడులు నిర్వహించామన్నారు. రూ.5.60 లక్షల విలువ గల 56 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి సోనుసింగ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది ఆశన్న, విశాల్, శ్రావణి, సరిత పాల్గొన్నారు.

### దాడి చేసిన ఇద్దరిపై కేసు

**ఆదిలాబాద్‌రూరల్:** ఒకరిపై దాడి చేసి గాయపర్చిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ రాంనగర్‌కు చెందిన సాన్‌కాంబ్లే దేవిదాస్ ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌లో గల బజాజ్ షోరూంలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విశాల్, శ్యాంలు గతంలో దేవిదాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసును వెనక్కి తీసుకోవాలంటే రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని అనడంతో దేవిదాస్‌పై దాడికి దిగడంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### బైక్ చోరీ

**భైంసా:** బాసరలో బైక్ చోరీకి గురైంది. మహేశ్ కుమార్ తన ఇంటి ముందు సోమవారం బైక్ నిలిపి ఉంచాడు. జ్వరం రావడంతో బైక్ హ్యాండిల్ లాక్‌వేయడం మరిచిపోయాడు. మంగళవారం బైక్ చూస్తే కనిపించలేదు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

# పత్రం చూపకుంటే చిక్కులే..

- రూ.50 వేల నగదు దాటితే ఆధారాలు తప్పనిసరి
- పోలీసుల తనిఖీల ముమ్మరం
- నగదు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా

జంగ్ తెలంగాణ

**నిర్మల్‌ఖిల్లా:** శాసన సభ ఎన్నికలకు ప్రకటన వెలువడి నియమావళి అమల్లోకి రావడంతో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయడంపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. అక్రమంగా డబ్బు, మద్యం తరలింపుపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లావ్యాప్తంగా తనిఖీల్లో నగదు ఆభరణాలు, విలువైన వస్తువులు పట్టుబడుతున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుంది.



సారంగాపూర్ మండలం మలక్‌చించోలి దారిలో మద్యం బాటిళ్లు పట్టుకున్న పోలీసులు (ఫైల్)

#### ఆధారాలు తప్పనిసరి

రూ.50 వేలకు పైగా నగదు వెంట తీసుకెళ్తే కచ్చితంగా సంబంధిత నగదుకు రసీదులు ఆధారపత్రాలు ఉండాలి. లేకపోతే నగదును సీజ్ చేస్తారు. రూ.10 లక్షలకు పైగా నగదు ఉంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం చేరవేస్తారు. ఆదాయపన్ను శాఖకు విషయం చేరుతుంది. పట్టుబడిన సందర్భంలో ఆధారాలు లేకపోతే నగదును తిరిగి పొందాలంటే జిల్లా ట్రెజరీశాఖ వారికి ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార లావాదేవీల నగదును రవాణా చేస్తున్నట్లయితే చట్టబద్ధంగా ఆధారాలు, పన్నులు సక్రమంగా కట్టిన రసీదులు వెంట కలిగి ఉండాలి. కుటుంబంలో వివాహం, వైద్యం వ్యవసాయం, ఇతరత్రా అవసరాలకు నిర్దేశిత మొత్తం దాటితే సంబంధిత వివరాల ఆధారాలు బిల్లులను చూపాల్సి ఉంటుంది.

#### కొన్ని ఘటనలు..

- మహారాష్ట్ర నుంచి తానూరు మీదుగా బైంసాకు వస్తుండగా రూ.1,40,000 నగదును ఎస్సై సందీప్ పట్టుకున్నారు.
- సారంగపూర్ మండల పరిధిలోని సిరిపెల్లి వద్ద గల చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర నుంచి తెస్తున్న మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు.
- సోన్ వద్ద బైక్‌పై రూ.50 వేలకు మించి తీసుకెళ్తున్న యువకుల నుంచి నగదును సీజ్ చేశారు.
- కుంటాల మండలం అర్లి(కే) రహదారి వద్ద రూ.లక్షా 62 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- సారంగాపూర్ మండలంలోని మలక్‌చించొలి సమీపంలో రూ.30 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

#### నిరంతర నిఘా

జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన కేంద్రాల్లో తనిఖీల ప్రక్రియ ముమ్మరమైంది. ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో పోలీసుశాఖ నేతత్వంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రోజు 24 గంటలు ప్రత్యేక నిఘాతో నిబంధనల మేరకు నిర్వర్తిస్తున్నారు. అలాగే మద్యం, డబ్బులు ఇతరాత్ర మభ్యపెట్టే వస్తువులను చేరవేస్తున్నట్లు సమాచారం అందితే వాటిని సీజ్ చేయనున్నారు.

#### ఆధారాలుంటే వారంలో వాపస్..

తనిఖీల్లో పట్టుబడ్డ నగదును మొదట జిల్లా ట్రెజరీ అధికారికి అప్పగిస్తారు. ఆ నగదుకు సంబంధిత ఆధారపత్రాలు వెంటనే చూపకపోయినా ఆ తర్వాత జిల్లాస్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడు సీజ్ చేసిన నగదును తిరిగి పొందవచ్చు. జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, డీసీవో, జిల్లా ఖజానా అధికారి సభ్యులుగా ఉండే ఈ కమిటీ కలెక్టరేట్లో అందుబాటులో ఉంటారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఆధారాలు సరైన పత్రాలు సమర్పించిన తర్వాత కమిటీ పరిశీలించి విశ్వసిస్తే ఆ సొమ్మును తిరిగి అందజేస్తారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కావల్సి ఉంటుంది. వారం దాటితే సీజ్ చేసిన నగదును ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే అందజేస్తారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే స్వాధీనం చేసుకున్న నగదును కోర్టుకు అప్పగించి విచారణ చేస్తారు. ఎన్నికల నియమావళి ముగిసిన తర్వాత కోర్టుకు ఆధారాలు సమర్పించి సొమ్మును విడిపించుకోవాల్సి ఉంటుంది.

#### జిల్లాలో తనిఖీలు



లక్ష్మణచాంద మండలం కనకాపూర్ వద్ద పోలీసుల తనిఖీ(ఫైల్)

జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. తానూరు, కుభీర్ మండలాల పరిధి, సారంగాపూర్ మండలం సిరిపల్లి వద్ద మహారాష్ట్ర సరిహద్దులో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతర్ జిల్లా సరిహద్దుల్లోనూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని నగదు, ఆధారాలు లేకుండా ఇతర వస్తువులు, మద్యం వంటివి సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### రూ.లక్ష నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో అధికారులు

**ఖానాపూర్:** మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుకున్నామని ఎస్ఎస్‌టీ టీం అధికారుల బృందం తెలిపాయి. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు తెలిపారు. ఎస్సై జి.లింబాద్రి, మండల పరిషత్ సూపరింటెండెంట్ స్వామి ఉన్నారు.

### మద్యం పట్టివేత

**నర్సాపూర్(జి):** మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం దర్యాపూర్‌లో మంగళవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఒకరు అక్రమ మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. దిలావర్పూర్‌కు చెందిన కోడె ముత్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**లోకేశ్వరం:** నర్సింహనగర్‌తండా శివారు ప్రాంతంలో అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్న మహేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

**కుంటాల:** మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన బుజ్జికి అభిలాష్ ఇంట్లో నిల్వ ఉన్న మద్యాన్ని ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. 11.60 లీటర్ల మద్యం విలువ సుమారు రూ.8093 ఉంటుందన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని, అభిలాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**బెల్టుషాప్‌లపై దాడి**

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్‌స్టేషన్ పరిధి లోని శంకర్‌గుట్ట, దస్నాపూర్ కాలనీల్లో నిర్వహిస్తున్న బెల్టుషాప్‌లపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. మద్యం బాటిళ్లను సీజ్‌చేసి, ఇద్దరి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.



కంట్రోల్ రూమ్‌లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది

### అంతా కలెక్టరేట్ నుంచే..



ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం నిఘా పటిష్టం చేసింది. ఇందుకోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి 24 గంటలు విధులు నిర్వహించేలా ఉద్యోగులను కేటాయించారు. వివిధ ప్రాంతాల నుంచి డబ్బు ఇతర సామగ్రి పంపిణీపై ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే ఓటు ఉందో లేదో అని కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకుంటున్నారు. వివిధ పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రకటనల కోసం డీపీఆర్‌వో కార్యాలయంలో మీడియా సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో భాగంగా అధికారులు 24 గంటలు పర్యవేక్షణ చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



మీడియా సెంటర్ విధుల్లో డీపీఆర్వో తిరుమల



ఫిర్యాదు స్వీకరిస్తున్న పోలీస్ సిబ్బంది



కాల్ సెంటర్లో ఫోన్‌లో ఫిర్యాదు స్వీకరిస్తూ..

### ప్రచారంలో పసివాళ్లు



**లోకేశ్వరం:** మండలంలోని పుస్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో పార్టీ ప్రచార రథంలో సరదా తిరిగారు. విద్యార్థులకు ఎన్నికల ప్రచారం సరదా నెలకొంది.

## కేసీఆర్ చేతిలో రాష్ట్రం బందీ

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

**నిర్మల్‌చైన్‌గేట్:** సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి సోనియాగాంధీకి బహుమతి ఇద్దామన్నారు. వందలాది మంది తెలంగాణ కోసం బలిదానం అయ్యారని, బాగుపడింది మాత్రం కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్మల్ ప్రజల ఓట్లతో గెలిచిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మామడ మండలంలో ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కబ్జాల మంత్రి, సండే ఎమ్మెల్యేతో ప్రజలకు ఒరిగిందేమీలేదని వచ్చే ఎన్నికల్లో ఇద్దరికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, శ్రీహరిరావు వారికి కండువాలు కప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మామడ మండలంలోని పోతారం గ్రామస్తులు తీర్మానం చేశారు.

**గ్యారెంటీ పథకాలకు వివరించాలి**

**దస్తురాబాద్:** కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ పథకాలను నాయకులు ఇంటింటికీ వివరించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జు పటేల్ సూచించారు. మండలంలోని దేవునిగూడెం, రేవోజీపేట గ్రామాల్లో మంగళవారం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయలన్నారు. అనంతరం దేవునిగూడెం సర్పంచ్ అంజన్న, పొద్దుటూరి శుశిలా, రాజన్న, సత్తన్న కుటుంబాలను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు చుంచు భూమన్న, భూషణ్, రాజు, ఇస్రు పటేల్, రమేశ్, మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.



పార్టీలో చేరిన గ్రామస్తులతో శ్రీహరిరావు

**గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం**

**లక్ష్మణచాంద:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం కేసీఆర్ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మేనిఫెస్టో ప్రకటించారని విమర్శించారు. నాయకులు సాగర్, రామకృష్ణ, ఒడ్నాల రాజేశ్వర్, అట్ల రామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటల శ్రీనివాస్, బూసి భూమన్న, గంగాధర్‌గౌడ్, భీమన్న, నారాయణ, రమేశ్ ఉన్నారు.

## ఆలయ కోనేరులో పడి ఒకరి మృతి

**సారంగపూర్:** మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ కోనేరులో పడి మంగళవారం ఒకరు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి ఫోన్ డేటా ఆధారంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మబాద్ తాలూకా, రత్నాలకు చెందిన ఊరేకర్ లింగురాం(26)గా గుర్తించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబీకులకు తెలియజేశారు. తండ్రి పుండలిక్ బంధువులతో కలిసి అడెల్లికి చేరుకుని మృతదేహం తన కుమారుడిదేనని నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కాగా, అమ్మవారిని దర్శించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

**సంప్రోక్షణ పనులు ప్రారంభం**

ఈ ఘటన నేపథ్యంలో ఆలయ కోనేరు సంప్రోక్షణ(శుద్ధి) చేసే పనులను ఈవో రవికిషన్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈనెల 21, 22వ తేదీల్లో మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సమీపిస్తుండడంతో పనులు వేగంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కోనేరు శుద్ధి అనంతరం పూజలు తర్వాత తిరిగి నీరు నింపే పనులు చేపడుతామన్నారు.

### కొండూరికి జాతీయ సాహిత్య పురస్కారం



పోతన్న (ఫైల్)

**సోన్:** నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన కవి కొండూరి పోతన్నకు డాక్టర్ బోయిభీమన్న స్మారక జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. కొండూరి గుండేచప్పుడు అనే కవిత సంకలనం, రచనతోపాటు సమకాలీన అంశాలపై వందలాది పద్యాలు రచించినందుకు 2023 సంవత్సరానికి గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం ఏపీలోని తిరుపతి లోని బాకరాపేటలో ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారం ప్రదానం చేశారు. పోతన్న.. సోన్ మండలం న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. పురస్కారం అందుకున్న ఆయన్ను హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు, సర్పంచులు గంగామణి, హారిత, వీడీసీ సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

### సజావుగా బీఈడీ కౌన్సెలింగ్



ప్రవేశపత్రం అందజేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కేబీ ప్రాంగణంలో నడుస్తున్న బీఈడీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం సజావుగా సాగింది. ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మెరిట్ ప్రకారం కళాశాలలో ప్రవేశపత్రాలు అందజేశారు. డీడీ మాట్లాడుతూ గిరిజన అభ్యర్థులకు బీఈడీలో చదువుకునేందుకు ఎంట్రెన్స్ లేకుండా అడ్మిషన్లు కల్పిస్తున్నామని అన్నారు. మొత్తం వంద సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

### దుర్గమ్మా..సల్లంగ చూడు





శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లావ్యాప్తంగా మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాతకు మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమిస్తుంది. ఆలయాల్లో దుర్గామాతకు పూజలు చేసి సల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు. పలు ఆలయాల వద్ద జరిగిన కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

## బాసరలో నవరాత్రి ఉత్సవాలు

**భైంసా:** చదువుల తల్లి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం వేకువజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని బాసర ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక క్యూలైన్‌లో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్న పిల్లలతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. సరస్వతీ అమ్మవారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రామారావుపటేల్, సతీశ్‌రావు, కిశోర్‌దేశాయి, శంకర్, సుభాష్, రాజేశ్వర్, శ్రీనుపటేల్, లక్ష్మణ్, సాయినాథ్, రమేశ్, సతీశ్‌రెడ్డి, పోతన్న, కృష్ణ, గడ్డం అనిల్ పాల్గొన్నారు.

**ఆలయంలో నిత్యాన్నదానం**

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసర ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. నాందేడ్‌కు చెందిన జగదీశ్‌మహారాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. భక్తులకు ఇక్కట్లు తలెత్తకుండా బాసర ఎస్సై గణేశ్ బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ కాంతుల మధ్య రాత్రి సమయంలో ఆలయం కాంతులీనుతుంది. అమ్మవారి అలంకార మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



అమ్మవారిని దర్శించుకున్న రామారావుపటేల్

### పేకాటరాయుళ్ల అరెస్టు

**బోథ్:** మండలంలోని జీడిపల్లె శివారులో మంగళవారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. పక్కా సమాచారంతోనే దాడి చేయగా పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.22,190 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.